సాక్షి
విజయనగరం

సోమవారం । 4 । డిసెంబర్ । 2023



వారి ప్రతిభ విభిన్నం
ప్రతిభకు వైకల్యం దూరంగా ఉంటుందని సమాజంలో దివ్యాంగులు అన్ని రంగాలలో రాణిస్తున్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు.
-10లో



లైసెన్స్ లేకుండా మెడికల్ షాపులు..! -10లో
లైసెన్స్ లేకుండా విక్రయించే మందులు నాణ్యమైనవో కాదో తెలియని పరిస్థితి.



పాడిపరిశ్రమకు అండదండలు
ఒకప్పుడు రైతులు వ్యవసాయం, పాడి పరిశ్రమను రెండు కళ్లుగా చూసుకునే వారు.
-10లో

న్యూస్‌రీల్

సర్వజన ఆస్పత్రిలో కార్నియా సేకరణ



కార్నియా సేకరిస్తున్న టెక్నీషియన్ శ్రీను

విజయనగరం ఫోర్ట్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి నుంచి రెడ్‌క్రాస్ సొసైటీ ఐ డోనేషన్ సెంటర్ సిబ్బంది కార్నియాను సేకరించారు. వివరాల్లోకి వెళ్తే.. గంట్యాడ గ్రామానికి చెందిన బి.గణపతిరావు(24) రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. అతని కార్నియాను సేకరించాలని రెడ్‌క్రాస్ ఐ డోనేషన్ సెంటర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఈ మేరకు ఐ డోనేషన్ సెంటర్ ఆప్తాల్మిక్ టెక్నీషియన్ ఎ.శ్రీను సర్వజన ఆస్పత్రి మార్చురీలో కార్నియాను సేకరించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి కేఆర్‌డీ ప్రసాదరావు మాట్లాడుతూ అన్ని దానాల కన్నా నేత్ర దానం గొప్పది అన్నారు. ఒక వ్యక్తి నేత్ర దానం ఇద్దరికి చూపునిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మరణానంతరం నేత్ర దానానికి ముందుకు రావాలని కోరారు.

ప్రశాంతంగా జాతీయ ఉపకార వేతన పరీక్ష

- 19 పరీక్ష కేంద్రాల్లో 4,210 మంది హాజరు



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి

విజయనగరం అర్బన్: 2023–24 విద్యా సంవత్సరానికిగాను జాతీయ ఉపకార వేతన పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 19 పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 4,338 మందిలో 4,210 మంది పరీక్షకు హాజరయ్యారని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని తెలిపారు. పరీక్షల నిర్వహణ పర్యవేక్షణలో భాగంగా డీఈఓ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించాయి.

ట్రైసైకిళ్ల పంపిణీ



ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే జోగులు

రేగిడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్రై సైకిళ్లు, పలు ఉపకరణాలను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, శాసన మండలి విప్ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం కోసం సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గేదెల వెంకటేశ్వరరావు, విప్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ శ్యామలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

జలాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం



జలాసనంలో ప్రముఖ జలాసన నిపుణుడు సుబ్బారావు, యోగా గురువు విజయలక్ష్మి

శృంగవరపుకోట: జలాసనాలతో సంపూర్ణమైన ఆరోగ్యం కలుగుతుందని ప్రముఖ జలాసన నిపుణుడు సుబ్బారావు, యోగా గురువు విజయలక్ష్మి అన్నారు. ఇందుకూరి రిసార్ట్‌లో 150 మందికి నీటిపై తేలియాడే విద్యపై ఆదివారం శిక్షణ ఇచ్చారు. పలువురికి అవగాహన కల్పించారు. నీటిలో జలాసనం వల్ల కలిగే ఆరోగ్య అంశాలను వివరించారు. అనంతరం కృష్ణ మహంతి పురం పీఏసీఎస్ అధ్యక్షుడు ఇందుకూరు రామరాజు, పీఆర్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు అశోక్‌రాజు తదితరులు సుబ్బారావు, విజయలక్ష్మిలను సత్కరించారు. పలువురు జలాసనాలను ఆసక్తిగా తిలకించారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు.. నేనున్నానని...



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు కరక రామయ్యమ్మ. ఈమెది గంట్యాడ మండలం పెదవేమలి గ్రామం. రెండు కిడ్నీలు పాడవ్వడంతో డయాలసిస్ చేయించుకుంటుంది. ఈమెకు ప్రతి నెల ప్రభుత్వం రూ.10 వేలు పింఛన్ అందజేస్తోంది. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా డయాలసిస్‌ను ఉచితంగా చేయిస్తోంది. రవాణా..ఇతర మందుల ఖర్చులకు ప్రభుత్వం ఇచ్చే పింఛన్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె చెబుతుంది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న బాలిక పేరు మహంతి సంజన. ఈమెది నెల్లిమర్ల మండలం గరికిపేట. సంజనకు ప్రతి నెల రక్తం తగ్గిపోతుండడంతో కుటుంబ సభ్యులు వైద్య పరీక్షలు చేయించడంతో సికిల్‌సెల్ ఎనీమియా అని నిర్ధారణ అయింది. ఈమెకు కూడా ప్రభుత్వం ప్రతి నెల రూ.10 వేలు అందజేస్తోంది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న బాలుడి పేరు మహంతి కూర్మారావు. ఇతనిది నెల్లిమర్ల మండలం గరికిపేట. సంజన, కూర్మారావులు అక్కాతమ్ముళ్లు. కూర్మారావుకు కూడా సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్ధారణ కావడంతో ఇతనికి కూడా ప్రభుత్వం రూ.10 వేలు పింఛన్ అందజేస్తోంది.

- నెలకు రూ.5 వేల నుంచి రూ.10 వేల పింఛన్ అందజేత
- నాలుగున్నరేళ్లలో రూ.47.53 కోట్ల అందజేత
- జిల్లాలో 1375 మంది లబ్ధిదారులు
- దేశంలోనే ఎక్కడా లేని విధంగా జగన్ సర్కార్ పింఛన్ పంపిణీ



గంట్యాడ మండలం పెదవేమలి గ్రామానికి చెందిన మంచానికి పరిమితమైన మరిపి ఎర్రినాయుడుకు రూ. 5 వేలు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సాగర్

విజయనగరం ఫోర్ట్:

వీరు ముగ్గురికే కాదు... వేలాది మందికి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం దీర్ఘకాలిక వ్యాధుల పింఛన్లు అందజేస్తోంది. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనివిధంగా ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాత్రమే ప్రభుత్వం కుష్టు, ఫైలేరియా, కిడ్నీ వ్యాధులు, పక్షవాతం, మంచానికే పరిమితం అయిన వారు, సికిల్‌సెల్ ఎనీమియా, తలసేమియా హిమోఫిలియా వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి ప్రభుత్వం అండగా ఉంటూ వారి జీవితాలకు భరోసా కల్పిస్తోంది. గతంలో ఏ ప్రభుత్వం దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల గురించి ఆలోచించిన దాఖలాలు లేవు. దీంతో ఆయా వ్యాధులకు వైద్యం చేయించుకోవడానికి బాధితులు వేలల్లో ఖర్చు చేసేవారు.

ఇటువంటి పరిస్థితి నుంచి వారికి అండగా నిలవాల ని ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నెలా పింఛన్ ఇస్తున్నారు. రూ. 5 వేలు, రూ.10 వేలు చొప్పున ప్రతి నెలా పింఛన్ అందజేస్తున్నారు.

వ్యాధి నిర్ధారణ పత్రం ఆధారంగా..

సంబంధిత వ్యాధి నిర్ధారణకు సంబంధించి ప్రభుత్వం లేబొరేటరీ, వైద్యులు ఇచ్చిన నిర్ధారణ పత్రాన్ని పీహెచ్‌సీ వైద్యుడు పరిశీలించి డీఎంహెచ్‌ఓకు పంపిస్తారు. డీఎంహెచ్‌ఓ వాటిని పరిశీలించి మంజూరు కొరకు ప్రభుత్వానికి పంపిస్తారు. దీర్ఘకాలిక వ్యాధులతో పింఛన్లు అందుకున్న వారు జిల్లాలో 1375 మంది ఉన్నారు. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛన్ల మాదిరి ప్రతి నెల ప్రభుత్వం పింఛన్ అందజేస్తోంది. ఒక్క కుష్టు వ్యాధిగ్రస్తులకు మాత్రమే రూ.3 వేలు పింఛన్ అందిస్తున్నారు. ఫైలేరియా (రెండు కాళ్లకు) ఉన్న వారికి రూ.5 వేలు, క్రానిక్ కిడ్నీ ఉన్న వారికి రూ.10 వేలు, కిడ్నీ, గుండె, లివర్ మార్పిడి జరిగిన వారికి రూ.5 వేలు, పక్షవాతంతో వీల్‌చైర్‌లో ఉన్న వారికి రూ.5 వేలు, హిమోఫిలియా, సికెల్‌సెల్ ఎనీమియా, తలసేమియా రోగులకు రూ.10 వేలు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడి మంచానికే పరిమితం అయిన వారికి రూ.5 వేలు పింఛన్ ప్రభుత్వం అందిస్తోంది.

నాలుగున్నరేళ్లలో రూ.47.53 కోట్లు అందజేత



2019 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పింఛన్ నిమిత్తం రూ.47.53 కోట్లు అందించింది. ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు రూ.2.10 కోట్లు, క్రానిక్ కిడ్నీ రోగులకు రూ. 23.76 కోట్లు, కిడ్నీ, లివర్ మార్పిడి చేయించుకున్న వారికి రూ.93 లక్షలు, కుష్టు వ్యాధిగ్రస్తులకు రూ. 5.16 కోట్లు, పక్షవాతం రోగులకు రూ.9.21 కోట్లు, హిమోఫిలియో రోగులకు రూ.1.38 కోట్లు, మంచానికే పరిమితం అయినవారికి రూ.1.80 కోట్లు, సికిల్‌సెల్ ఎనీమియా రూ.97.20 లక్షలు, తలసేమియా రూ.2.22 కోట్లు అందించారు.

దీర్ఘకాలిక పింఛన్లు అందుకుంటున్న వారి వివరాలు ఇలా..

వ్యాధి రకం	రోగుల సంఖ్య	నగదు
ఫైలేరియా	70	రూ.2.10 కోట్లు
క్రానిక్ కిడ్నీ వ్యాధి	396	రూ.23.76 కోట్లు
కిడ్నీ, గుండె,లివర్ మార్పిడి	31	రూ.93 లక్షలు
కుష్టు	287	రూ.5.16 కోట్లు
పక్షవాతం	307	రూ.9.21 కోట్లు
హిమోఫిలియా	23	రూ.1.38 కోట్లు
మంచానికే పరిమితం	60	రూ.1.80 కోట్లు
సికిల్‌సెల్ ఎనీమియా	162	రూ.97.20 లక్షలు
తలసేమియా	37	రూ.2.22 కోట్లు

గొప్ప విషయం



దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి పింఛన్లు ఇవ్వడం గొప్ప విషయం. ఇది ఎంతగానో వారికి ఉపయోగపడుతుంది. ఆయా వ్యాధులతో బాధపడే వారికి మందులకు ప్రతి నెల రూ.వేలలో ఖర్చు అవుతుంది. ఈ పింఛన్ వారి వైద్యానికి ఉపయోగించుకుంటారు.
– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

పారాది వంతెన నిర్మాణానికి రంగం సిద్ధం

- వారం రోజుల్లో అప్రోచ్ రోడ్డు పనులు ప్రారంభించనున్న అధికారులు
- రూ.10.90 కోట్ల నుంచి రూ.13.80 కోట్లకు అంచనాలు పెంచి ప్రతిపాదనలు



పారాది వంతెన వద్ద అప్రోచ్ నిర్మించేందుకు సిద్ధం చేసిన మెటీరియల్, యంత్రాలు

బొబ్బిలి: పారాది వంతెన నిర్మాణానికి ముందస్తు పనులు ప్రారంభించనున్నారు. ఇందు కోసం ముందుగా నది గుండా అప్రోచ్ రోడ్డు నిర్మాణం ప్రారంభం కానుంది. ఇప్పటికే మెటీరియల్‌ను కాంట్రాక్టర్ ద్వారా వేయించారు. మరో వారం రోజుల్లో దాని నిర్మాణం ప్రారంభించనున్నారు. పారాది వంతెనకు ఇప్పటికే రూ.10.90 కోట్లు మంజూరు చేశారు. పాత వంతెనపై రాకపోకలు సాగిస్తూ నిర్మాణం చేద్దామనుకున్నారు. అయితే వంతెన హఠాత్తుగా పాడవడంతో మరమ్మతులు చేయించి లైట్ వెహికల్స్‌కు మాత్రమే అనుమతిస్తూ మిగతా వాటిని బాడంగి, తెర్లాం మీదుగా ప్రస్తుతం డైవర్ట్ చేస్తున్నా రు. దీంతో ప్రస్తుతం వంతెన నిర్మాణాన్ని ప్రారంభి స్తే అప్రోచ్ రోడ్డు తప్పనిసరిగా వేయాల్సిన పరిస్థితి ఉంది. ఈ అప్రోచ్ రోడ్డును గతంలో వంతెన మరమ్మతులప్పుడు వేసినట్టు కాకుండా దృఢంగా వేసి పెద్ద వెహికల్స్‌ను కూడా అనుమతించాల్సి ఉంటుంది. అందుకనే ఇప్పుడు దృఢమయిన అప్రోచ్ రోడ్డును పారాది వేగావతి నదికి అడ్డంగా నిర్మించను న్నారు. రెండు రోజులుగా వాహనాలు, యంత్ర సామగ్రి, మెటీరియల్‌ను చేరవేశారు. వాహనాలన్నింటినీ అనుమతించేందుకు అప్రోచ్ రోడ్డును దృఢంగా నిర్మించనున్నామని, వచ్చే వారం నుంచి అప్రోచ్ రోడ్డును వేగావతి నదిలో నిర్మిస్తామని ఆర్‌అండ్‌బీ బొబ్బిలి ఏఈ బీఏకే రాజు 'సాక్షి'కి తెలిపారు.

రెండ్రోజుల్లో ఓటర్ల అభ్యంతరాలు 17,806

- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: అక్టోబర్ నెలలో విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాపై రెండు రోజులుగా చేపడుతున్న అభ్యంతరాలు, క్లెయిమ్స్ స్వీకరణ డ్రైవ్ ఆదివారంతో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 1,847 బీఎల్‌ఓ కేంద్రాల్లో రెండు రోజుల పాటు ఫారం -6, ఫారం-7, ఫారం-8 అంశాల విన్నపాలు 17,806 నమోదయ్యాయని కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గాల వారిగా వీటి వివరాలు ఇలా ఉన్నాయి.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల నుంచి స్వీకరించిన ఫారం-6, 7, 8 వినతులు

నియోజకవర్గం	ఫారం–6	ఫారం–7	ఫారం–8	మొత్తం
రాజాం (ఎస్సీ)	1,731	80	546	2,926
బొబ్బిలి	1,571	792	607	2,970
చీపురుపల్లి	1,090	786	345	2,221
గజపతినగరం	1,066	577	349	1,992
నెల్లిమర్ల	976	459	314	1,749
విజయనగరం	2,056	307	1,272	3,635
ఎస్.కోట	1,134	407	772	2,313
మొత్తం	9,624	3,977	4,205	17,806

వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న కోలగట్ల



తిరుమల క్షేత్రంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

విజయనగరం: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వేంకటేశ్వరస్వామిని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు కోలగట్లకు వేదాశీర్వచనం అందజేశారు. ప్రజలకు వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ఉండాలని కోలగట్ల ఆకాంక్షించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని స్వామిని కోరుకున్నట్టు ఆయన పేర్కొన్నారు. కోలగట్లతో పాటు నగర పాలక సంస్థ కమిషనర్ ఆర్.శ్రీరాముల నాయుడు దంపతులు, సహాయ కమిషనర్ ప్రసాదరావు దంపతులు తదితరులు ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- కలెక్టర్ నాగలక్ష్మి



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బీఎల్‌ఓలకు వివరాలు అడుగుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

రాజాం సిటీ: బీఎల్‌ఓలు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ నాగలక్ష్మి హెచ్చరించారు. ఓటర్ల నమోదు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా రాజాంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓల వద్ద చేర్పులు, మార్పులు, మరణించిన వారి ఓట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీనికి పొంతన లేని సమాధానాలు చెప్పడంతో బీఎల్‌ఓలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ పార్టీల నాయకులు ఫిర్యాదు చేసినంత వరకు బీఎల్‌ఓలు ఏం చేస్తున్నారని, నెల రోజులైనా నిర్లక్ష్యం వహించడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇంటింటికి వెళ్లి పూర్తి స్థాయిలో ఓటర్ల చేర్పులు, వలసలు వెళ్లిన వారు, మరణించిన వారి ఓట్ల తొలగింపు, డబుల్ ఎంట్రీలపై దృష్టి సారించాలని సూచించారు. బీఎల్‌ఓలంతా లక్ష్యాలను పూర్తి చేసి ఐదు రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఎస్‌కే రాజును ఆదేశించారు. ఎవరి నుంచైనా ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. రాజాం నియోజకవర్గంలోనే బీఎల్‌ఓలు వెనుకంజలో ఉన్నారని, వారంతా లక్ష్యాలు చేరుకునేలా చూడాలని ఆర్‌ఓ సుధారాణిని ఆదేశించారు. జూనియర్ కళాశాలలో నాడు – నేడు కింద పనులు త్వరగా పూర్తి చేసి పోలింగ్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఉరిటి జగదీశ్వరరావుకు సూచించారు. కలెక్టర్ వెంట ఈడీటీ ప్రకాష్‌రాజు, ఆర్ఐ విద్యాసాగర్ ఉన్నారు.

నూర్పిన ధాన్యం వెంటనే కొనుగోలు : కలెక్టర్

విజయనగరం అర్బన్: తుపాను పరిస్థితుల దృష్ట్యా రైతులు వరి కోతలు వాయిదా వేయాలని, నూర్పిన ధాన్యం వెంటనే కొనుగోలు కోసం సమీప ఆర్‌బీకేలను సంప్రదించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి రైతులకు ఆదివారం విజ్ఞప్తి చేశారు. చేను కోత కోసిన పరిస్థితి ఉంటే తప్పనిసరిగా కుప్పలుగా వేసుకోవాలని సూచించారు. వీలున్నంత వరకు ప్లాస్టిక్ షీట్‌లో లేదా టార్పాలిన్లతో కప్పి ఉంచుకోవాలని కూడా సూచించారు. జిల్లాలో సాగు చేసిన 2.31 లక్షల ఎకరాల వరి సాగులో 66 శాతం 1.53 లక్షల ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయని వివరించారు. ఈ ఏడాది 2,817 ఎకరాల మేరకు పంట మార్పిడి జరిగిందని దీనిని వెంటనే ఆర్‌బీకే ద్వారా కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. రైతులు తమ దగ్గర ఉన్న నూర్పిడి చేసిన ధాన్యాన్ని సంబంధిత రైతు భరోసా కేంద్రం అసిస్టెంట్‌కి తెలియజేసి ధాన్యం కొనుగోలు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 4వ తేదీ నుంచి జిల్లాలో ఒక మోస్తరు వర్షపాతం అలాగే ఐదు, ఆరు తేదీల్లో అధిక వర్షపాతం నమోదయ్యే పరిస్థితి ఉందని తెలిపారు. ఈ పరిస్థితిలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ప్రకటించారు. ఎలాంటి సమస్యలైనా.. రైతులు కంట్రోల్ రూం 89789 75284 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

తెలుగు భాషాభ్యున్నతికి గురజాడ విశేష కృషి

- గురజాడ విశిష్ట పురస్కార గ్రహీత చంద్రబోస్
- కన్యాశుల్కం ఓ మహాకావ్యం : హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాదరావు
- ఆకట్టుకున్న మహిళల కన్యాశుల్కం నాటక ప్రదర్శన



మహాకవి విగ్రహానికి పూలమాలలేస్తున్న చంద్రబోస్



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి యు.దుర్గాప్రసాదరావు

విజయనగరం టౌన్: తెలుగు భాష అభ్యున్నతికి కృషి చేసిన వారిలో గురజాడ ప్రముఖులని సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత కె.ఎస్.చంద్రబోస్ పేర్కొన్నారు. స్థానిక ఆనందగజపతి కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో గురజాడ విశిష్ట పురస్కారాన్ని చంద్రబోస్‌కు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి యు.దుర్గాప్రసాదరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత చంద్రబోస్ మాట్లాడుతూ మహాకవి రాసిన పుస్తకాలు, కవిత్వం, సాహిత్యం చదివి, ఆచరించే ప్రయత్నం చేస్తున్న వాడిని కాబట్టి అద్భుతమైన అనుభూతి కలిగిందన్నారు. ఇన్నాళ్లకు ఈ మహనీయుని ఇంట అడుగు పెట్టే అదృష్టం తనకు గురజాడ సమాఖ్య ద్వారా నేటికి కలిగిందన్నారు. ఆయన పురస్కారం తనకు దక్కడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి యు.దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ సమాజంలో ఉన్న తీవ్రమైన దురాచారాన్ని చూసి మహాకవి చలించిపోయాడన్నారు. గురజాడ సంఘ సంస్కరణ, అభిలాష కలిగిన కవి అన్నారు. సాంఘిక దురాచారాలను ఎత్తిచూపడం, పరిష్కార మార్గాన్ని చూపించడం కంటే సాహిత్యానికి వేరే మార్గం లేదని లోకానికి చాటి చెప్పాడన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కళ్యాణ చక్రవర్తి, సీనియర్ న్యాయవాది కెవిఎస్.తమ్మన్న శెట్టి, సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్, కోశాధికారి డాక్టర్ ఎ.గోపాలరావు, డాక్టర్ జక్కు రామకృష్ణ, భోగరాజు సూర్యలక్ష్మి, అనిల్, వెంకటేశ్వరరావు, మేకా అనంతలక్ష్మి, నవసాహితీ సంస్థ అధ్యక్షుడు సూర్యప్రకాష్ (చెన్నై), ఈపు విజయకుమార్, నాలుగెస్సుల రాజు, గురజాడ వారసులు గురజాడ వెంకటేశ్వరప్రసాద్, ఇందిర, లలిత తదితరులు పాల్గొన్నారు.

గురజాడ సాహిత్య పురస్కారాలు

మహాకవి గురజాడ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన కవితా పోటీల్లో సాలూరుకి చెందిన కిలపర్తి దాలినాయుడు, శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసకు చెందిన కుప్పిలి వెంకటరావు, విజయనగరానికి చెందిన సాలూరు సంతోషి, విశాఖ నుంచి అల్లంశెట్టి శ్రీనివాసరావు, హైదరాబాద్ నుంచి దేశరాజు, విజయనగరం నుంచి రత్నాల బాలకృష్ణ, సింహాచలం నుంచి లోగిస లక్ష్మీనాయుడు, కర్నూల్ నుంచి సయ్యద్ జవహర్ అహ్మద్‌లు పాల్గొని గురజాడ విశిష్ట పురస్కార గ్రహీత చంద్రబోస్ చేతుల మీదుగా సాహితీ పురస్కారాలను అందుకున్నారు.

ఆద్యంతం ఆలోచింపజేసిన కన్యాశుల్కం

మహాకవి గురజాడ రచించిన కన్యాశుల్కం నాటక ప్రదర్శనను మహిళామణులు నిర్వహించి అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేశారు. ఈపు విజయకుమార్ దర్శకత్వంలో భోగరాజు సూర్యలక్ష్మి గిరీశం పాత్ర ఆద్యంతం ఆలోచింపజేసింది. వెంకటేశం పాత్రలో కుమారి వాకా దేదీప్య అద్భుతమైన ప్రతిభను చూపింది. అగ్నిహోత్రవధానులుగా కుమారి సామవేదుల గీతారాణి, కరటకశాస్త్రిగా ముళ్లపూడి సుభద్రాదేవి రక్తి కట్టించారు. బుచ్చమ్మగా సామవేదుల సత్యలత, వెంకమ్మగా ఉదయగిరి నీలిమల ప్రదర్శనకు కరతాళ ధ్వనులు మిన్నంటాయి.

గురజాడ గృహాన్ని దర్శించిన చంద్రబోస్

మహాకవి గురజాడ స్వగృహాన్ని సినీగేయ రచయిత చంద్రబోస్ ఆదివారం సాయంత్రం దర్శించారు. మహాకవి చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. గురజాడ ముని మనవడు గురజాడ వెంకటేశ్వరప్రసాద్, ఇందిర ఆయనకు ఘన స్వాగతం పలికారు. సిరిపురపు ప్రవల్లికానారాయణ్ వేసిన కన్యాశుల్కంలోని పలు చిత్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం మహాకవి వాడిన బావి, తులసి కోట, మేడపైన గదిలో ఉన్న గురజాడ వాడిన కళ్లద్దాలు, పుస్తకం, పరిశీలించారు. విజిటర్స్ డైరీలో సంతకం పెట్టి ఆనందాన్ని వ్యక్తం చేశారు. మహాకవి స్వదస్తూరిని చూసి ఆనందించారు.



మహిళామణుల కన్యాశుల్కం నాటకం ప్రదర్శన

క్లుప్తంగా

15 కోళ్లు చోరీ



కోళ్లు దొంగిలించిన ఫారం ఇదే

బలిజిపేట: బలిజిపేట–పెదపెంకి మార్గంలో ఉన్న డైరీ ఫారం వద్ద పెంచుకుంటున్న 15జాతి కోళ్లను ఎవరో దొంగిలించారని యజమాని డి.శ్రావణ్‌కుమార్ తెలిపాడు. చోరీకి గురైనవి సుమారు రూ.15వేల విలువైన జాతికోళ్లు అని చెప్పాడు. పెదపెంకి మార్గంలో సత్రమాను చెట్టువద్ద పాలడైరీ నిర్వహించుకుంటూ అక్కడే జాతికోళ్లను పెంచుకుంటున్నానని, రోజూ లాగానే ఆదివారం ఉదయం వచ్చి చూసేసరికి 15కోళ్లు లేవని, ఈ విషయం పోలీసులకు తెలియజేశానన్నాడు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



గణపతిరావు మృతదేహం

గంట్యాడ: మండల కేంద్రానికి చెందిన బి. గణపతిరావు గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందాడు. ఆదివారం తెల్ల వారు జామున 3:30 గంటల ప్రాంతంలో కాలకృత్యాలు తీసుకోవడానికి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన గణపతిరావును చికిత్స నిమిత్తం స్థానికులు విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

పాముకాటుతో వ్యక్తి..



పాముకాటుతో మృతిచెందిన రమేష్ (ఫైల్)

జామి: మండలంలోని అలమండ గ్రామానికి చెందిన రొంగలి రమేష్(47) గత నెల 26వ తేదీన పొలంలో వరిచేను కోస్తున్న సమయంలో పాటు కాటుకు గురవడంతో విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సిఫారసు మేరకు విశాఖ కేజీహెచ్‌కు, అమెరికన్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య అరుణ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై హెచ్‌సీ ఈశ్వరరావు కేసు నమోదు చేశారు.

కొట్లాటపై కేసు నమోదు

భోగాపురం: ఇద్దరు అన్నదమ్ముల మధ్య జరిగిన కొట్లాటపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తవుడు తెలిపారు. దీనిపై ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన సరగడ సన్నిబాబు, సన్నిరాజు అన్నదమ్ములు. వారి 5 సెంట్ల స్థలం కోసం వివాదం తలెత్తింది. ఈ వివాదంలో అన్న సన్నిబాబు కర్ర తీసుకుని తమ్ముడు సన్నిరాజు తలపై కొట్టడంతో ఆస్పత్రి పాలయ్యాడు. బాధితుడు సన్నిరాజు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పి.ఆమిటి గ్రామానికి చెందిన ఆరిక సంపత్ ఆదివారం సాయంత్రం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పొలం పనులు ముగించుకుని ఇంటికొచ్చిన తల్లి అపస్మారక స్థితిలో ఇంట్లో పడి ఉన్న కుమారుడ్ని చూసి, తక్షణ సపర్యలు చేసి, కుటుంబసభ్యుల సాయంతో భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చింది. ప్రథమ చికిత్స అందించిన అనంతరం వైద్యుల సూచన మేరకు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొంతుదున్నాడు. సంపత్ ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

ప్రత్యేక ఓటరు నమోదుకు 8,428 దరఖాస్తులు

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో శనివారం, ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో ఫారం–6,7,8 కు సంబంధించి 8,428 వినతులు వచ్చాయి. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు పేర్కొన్నారు. పాలకొండ నియోజకవర్గంలోని 287 పోలింగ్ కేంద్రాలలో 825 ఫారం–6లు, 703 ఫారం–7లు, 854 ఫారం –8లు దరఖాస్తులు వచ్చాయి. అలాగే కురుపాం నియోజకవర్గంలో 268 పోలింగ్ కేంద్రాలనుంచి 516 ఫారం–6లు, 168 ఫారం–7లు, 210 ఫారం–8లు వచ్చాయి. పార్వతీపురం నియోజకవర్గంలో 233 పోలింగ్ కేంద్రాలనుంచి 1,794 ఫారం–6లు, 367 ఫారం–7లు, 347 ఫారం–8లు వచ్చాయి. సాలూరు నియోజకవర్గంలోని 243 పోలింగ్ కేంద్రాలనుంచి 1420 ఫారం–6లు,779 ఫారం–7లు,445 ఫారం–8లు వచ్చినట్లు జేసీ వివరించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹80	₹130	₹140

వారి ప్రతిభ విభిన్నం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రతిభకు వైకల్యం దూరంగా ఉంటుందని ఎప్పుడూ అడ్డుకాదని, సమాజంలో సాధారణ పౌరుల కంటే దివ్యాంగులు అన్ని రంగాలలో రాణిస్తున్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యుడు అలజంగి జోగారావు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్నివిధాలా విభిన్న ప్రతిభావంతులను ఆదుకుంటుందని చెప్పారు. వారి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తోందని తెలిపారు. దివ్యాంగులకు ఉన్నత విద్యాసంస్థలలో ఐదు శాతం రిజర్వేషన్ అమలు, ప్రతినెల పెన్షన్లు, ఉపకరణాల పంపిణీ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

ప్రతినెల పెన్షన్

పార్వతీపురం మన్యం జిల్లాలో 15,630 మందికి ప్రతినెల పెన్షన్ అందిస్తున్నామని, జిల్లా ఏర్పడిన ఏడాది కాలంలో రూ.48లక్షల విలువచేసే 40 మూడు చక్రాల మోటార్ వాహనాలు, రూ.22 లక్షల రుణాలు, రూ.1.60 లక్షల విలువచేసే నాలుగు ల్యాప్‌ట్యాప్‌లు, రూ.15 వేల విలువచేసే స్మార్ట్ ఫోన్స్, రూ.97వేల విలువచేసే ట్రై సైకిల్స్ రూ.15, 16 వేలు విలువ చేసే వినికిడియంత్రాలు 4 పంపిణీ చేశామని వివరించారు. విభిన్న ప్రతిభావంతులు సమస్యలు ఉంటే ఎప్పుడైనా తనను కలిసి తెలియజేయవచ్చునని నిరంతరం అందుబాటులో ఉంటానని, వాటికి పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. బస్‌పాస్‌ల సమస్య గురించి విభిన్న ప్రతిభావంతులు తెలియజేయగా వెంటనే ఆర్టీసీ అధికారులతో ఎమ్మెల్యే జోగారావు మాట్లాడి సమస్యను పరిష్కరించవలసినదిగా కోరారు.



ల్యాప్‌ట్యాప్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ఉపకరణాల పంపిణీ

అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రూ.లక్షా పదిహేడు వేలు విలుచేసే మూడు ల్యాప్‌ట్యాప్‌లను పార్వతీపురానికి చెందిన గట్టు సుధారాణి, గుమ్మలక్ష్మీపురం మండలం నంద్రుకోన గ్రామానికి చెందిన కొల్లిక హేమలత, తురుమామిడి గ్రామానికి చెందిన కర్రి వరలక్ష్మీలకు ఎమ్మెల్యే జోగారావు అందజేశారు. అలాగే రూ.42,750 విలువచేసే మూడు స్మార్ట్ ఫోన్లు, రూ.16వేలు విలువచేసే 5 వినికిడియంత్రాలు, రూ.24వేల విలువచేసే 3 వీల్ చైర్స్ పంపిణీ చేశారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ముల్లు ప్రసాద్, పిట్టగంగులు, పెంటలక్ష్మి, ఎస్.భాస్కరరావు, జి.రాములమ్మ, కందిపరమేష్‌లను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు కె.కవిత, నీడ్ డైరెక్టర్‌లు పి.వేణు గోపాలరావు, ముల్లు ప్రసాద్, భాస్కరరావు, కందిశ రమేష్, సిబ్బంది పీవీ రమణమూర్తి తదితరులు హాజరయ్యారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు 40 మంది ఎంపిక



రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

- ఈ నెల 8 నుంచి జిల్లాలో నిర్వహణ

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న ఫెన్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక ఆదివారం పూర్తయింది. ఈ మేరకు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని విజ్జి స్టేడియం ప్రాంగణంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో 100 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. వారికి సబ్ జూనియర్, క్యాడెట్ విభాగాల్లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఉత్తమప్రతిభ కనబరిచిన 40 మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిలో సబ్ జూనియర్ విభాగంలో 18 మంది, క్యాడెట్ విభాగంలో 22 మంది క్రీడాకారులు ఉన్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ముఖ్య శిక్షకుడు డీవీ చారి ప్రసాద్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 8 9 10వ తేదీలలో విజయనగరంలోని ఇండోర్ స్టేడియంలో 10వ సబ్ జూనియర్, 9వ క్యాడెట్ విభాగాల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపిక పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరైన వైఎస్ఆర్‌సీపీ విజయనగరం పార్లమెంట్ జిల్లా సెక్రటరీ ముద్దాడ మధు, బీసీ సంఘం అధ్యక్షురాలు గదుల సత్యలత మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు రాష్ట్ర , జాతీయస్థాయిలో పథకాలు సాధించాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు కోచ్‌లు, ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విషణ్ణవదనాలతో ఆక్టోపస్ కానిస్టేబుల్ అంత్యక్రియలు



సోమేశ్వరరావు(ఫైల్)

సంతకవిటి: మండలంలోని వాల్తేరు గ్రామానికి చెందిన ఆక్టోపస్ కానిస్టేబుల్ గురుగుబెల్లి సోమేశ్వరరావు(33) అంత్యక్రియలు విషణ్ణవదనాలతో ఆదివారం జరిగాయి. 16వ బెటాలియన్‌కు చెందిన ఆయన డిప్యుటేషన్‌పై ఆక్టోపస్ కానిస్టేబుల్‌గా విజయవాడలో పనిచేస్తున్నారు. శనివారం అక్కడ జరిగిన 10కే రన్‌లో పాల్గొని గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్లేలోగానే మృతిచెందారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న తల్లి లక్ష్మి, భార్య వెంకటలక్ష్మి దుఃఖసాగరంలో మునిగిపోయారు. ఆయనకు 2 సంవత్సరాల కుమార్తె శరణ్య ఉంది. ఆయన తండ్రి చంద్రినాయుడు గతంలోనే చనిపోయారు. కానిస్టేబుల్ మృతదేహాన్ని ఆదివారం వాల్తేరు తీసుకురాగా, 16వ బెటాలియన్ పోలీసులు గ్రామానికి చేరుకుని గౌరవవందనం సమర్పించారు. డీఎస్పీ శ్రీనివాసచక్రవర్తి, రాజాం సీఐ రవికుమార్, సంతకవిటి ఎస్సై లోకేశ్వరరావు, తదితరులు సోమేశ్వరరావు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.



సోమేశ్వరరావుకు సెల్యూట్ చేస్తున్న డీఎస్పీ

లైసెన్స్ లేకుండా మెడికల్ షాపులు..!

- ప్రభుత్వ ఆదాయానికి గండి
- ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చి మందుల విక్రయం

విజయనగరం ఫోర్ట్: తెర్లాం మండలంలో ఓ వ్యక్తి లైసెన్స్ లేకుండా మందులు విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఔషధ నియంత్రణశాఖ (డ్రగ్ కంట్రోల్) అధికారులు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు.

- విజయనగరం పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఒడిశా నుంచి రహస్యంగా మందులు తెచ్చి లైసెన్స్ లేకుండా ఇక్కడ విక్రయిస్తున్నట్టు ఔషధ నియంత్రణశాఖ అధికారులకు సమాచారం రావడంతో అధికారులు విచారణ చేస్తున్నారు.
- మందుల వ్యాపారం లాభదాయకంగా ఉండడంతో కొంత మంది ధనార్జన కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. దీని వల్ల ప్రభుత్వ రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. జిల్లాలో మందుల దుకాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వాటిలో కొన్ని లైసెన్స్ తీసుకుని పెడుతుంటే మరి కొంత మంది ఎటువంటి లైసెన్స్ లేకుండానే మందులు విక్రయిస్తున్నారు. దొరికితే దొంగ లేదంటే దొర అన్న చందాన వ్యవహరిస్తున్నారు. లైసెన్స్ తీసుకుని షాపు పెట్టి మందులు విక్రయిస్తే ప్రభుత్వానికి పన్ను కట్టాల్సి వస్తుంది. అదే లైసెన్స్ తీసుకోకపోతే ఎటువంటి ఫీజులు, పన్నులు చెల్లించాల్సిన అవసరం ఉండదు. మందులు విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయం పూర్తిగా పొందవచ్చుననే భావనతో కొంతమంది వ్యాపారులు వ్యవహరిస్తున్నారు. లైసెన్స్ తీసుకున్న మందుల దుకాణాలు 800 వరకు జిల్లాలో ఉంటాయి.



మందుల దుకాణం

తెలియని మందుల నాణ్యత

లైసెన్స్ లేకుండా విక్రయించే మందులు నాణ్యమైనవో కాదో తెలియని పరిస్థితి. లైసెన్స్ ఉన్న మందుల దుకాణాలైతే ఔషధ నియంత్రణ అధికారులు శాంపిల్స్ సేకరించి వాటి నాణ్యతను నిర్ధారించడానికి విజయవాడ ల్యాబొరేటరీకి పంపిస్తారు. లైసెన్స్ లేకుండా విక్రయంచే వారి దగ్గర మందుల శాంపిల్స్ సేకరించడం కుదరదు. నాణ్యత లేని మందులు వేసుకోవడం వల్ల రోగుల ఆరోగ్య పై ప్రభావం చూపి ప్రాణం మీదికి వస్తుంది.

లైసెన్స్ లేకుండా విక్రయం కూడదు



లైసెన్స్ లేకుండా మందులు విక్రయించకూడదు. అలా మందులు విక్రయించిన వారిపై ఫిర్యాదు వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటున్నాం. ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. జిల్లాలో ఎక్కడైనా లైసెన్స్ లేకుండా మందులు విక్రయించినా, మందులు నిల్వ చేసినా ఫిర్యాదు చేయాలి. నాణ్యత లేని మందులు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– రజిత, అసిస్టెంట్ డైరెక్టర్, ఔషధ నియంత్రణ శాఖ

• పార్క్‌లో సందర్శకుల సందడి



పార్కులో సందర్శకులు

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు కుడిమట్టికట్ట పరిసరాలలో ఉన్న ఐటీడీఏ పార్క్ సందర్శకులతో సందడిగా మారింది. పాఠశాలలకు ఆదివారం సెలవు కావడంతో చిన్నారులతో కలిసి తల్లిదండ్రులు పార్క్‌కు వచ్చి ఆనందంగా గడిపారు. జంప్ బాల్స్, జారుడు బల్ల, ఊయల తదితర ఆటలను చిన్నారులు ఆడారు. పార్క్ సమీపంలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌లో ఐస్‌క్రీంతో పాటు ఇతర తినుబండారాలను తిని ఉత్సాహంగా గడిపారు. పార్క్‌లో ఉన్న విగ్రహాలు సందర్శకులకు ఆకర్షణీయంగా నిలిచాయి.

37 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరి అరెస్ట్

విజయనగరం క్రైమ్: పశ్చిమబెంగాల్‌కు చెందిన మాజిబర్ రెహమాన్, సర్దార్‌లు గంజాయి తరలిస్తుండగా ఎస్ఈబీ సిబ్బంది అరెస్ట్ చేసి 37కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్ఈబీ విజయనగరం–1 బి.మధుకుమార్ మాట్లాడుతూ ఆదివారం రాత్రి సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్ రోడ్డులో పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు కనిపించడంతో వారిని పట్టుకుని, విచారణ చేశామని చెప్పారు. ఈ క్రమంలో వారి దగ్గర ఉన్న నాలుగు బ్యాగ్‌లలో 37 కిలోల బరువు కలిగిన 21 గంజాయి ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిద్దరి మొబైల్స్ సీజ్ చేసి, అరెస్ట్ చేశామని చెప్పారు. పట్టుకున్న గంజాయి విలువ మార్కెట్ ప్రకారం సుమారు రూ. 2 లక్షల ఉంటుందని తెలిపారు. గంజాయిని ఒడిశా నుంచి తమిళనాడుకు తీసుకుని వెళ్తుండగా నిందితులు విచారణలో అంగీకరించారన్నారు. దాడుల్లో ఎస్సై జాన్‌ప్రసాద్, హెచ్‌సీ ధనరాజు, వెంకటరమణ, గంగాధర్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గంజాయి నిందితులతో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు

చేపల వేటకు వెళ్లవద్దు..

పూసపాటిరేగ: తీరప్రాంత మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని తహసీల్దార్ ఇ.భాస్కరరావు సూచించారు. మండలంలోని చింతపల్లిరేవును ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తుఫాన్ నేపథ్యంలో వేట తగదన్నారు. అనంతరం పతివాడబర్రిపేట, తిప్పలవలస రేవులో మత్స్యకారులకు అవగాహన కల్పించారు. ఆయనతో పాటు చింతపపల్లి మెరైన్ సీఐ వైకుంఠరావు, భోగాపురం సీఐ విజయ్‌కుమార్, తదితరులున్నారు.



చింతపల్లిలో మత్స్యకారులకు హెచ్చరికలు జారీ చేస్తున్న తహసీల్దార్ తదితరులు

ఆందోళనలో అన్నదాత

డెంకాడ: వరుసుగా వస్తున్న అల్పపీడనాలు, తుఫాన్‌లు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి పంట కోత దశలో ఉంది. తీవ్ర వర్షాభావ పరిస్థితులను దాటుకుని పండిన పంటను కాపాడుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. కోత కోసిన పంటను పొలాల్లోనే కుప్పలుగా పెడుతున్నారు. ఇంకా కొన్ని చోట్ల కోతలు పూర్తి చేయలేదు. తుఫాన్ ప్రభావంతో వర్షాలు పడితే తమ పరిస్థితి ఏమిటని రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఇదిలా ఉంటే వరి పంటను ఎలా కాపాడుకోవాలో వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి అవగాహన కల్పిస్తున్నారు.

పాడిపరిశ్రమకు అండదండలు

- ఆర్బీకేల ద్వారా పశుపోషణ
- 75 శాతం రాయితీపై గడ్డి విత్తనాలు అందజేత
- జిల్లాలో 60.02 టన్నుల విత్తనాల పంపిణీ లక్ష్యం



చీపురుపల్లి మండలంలోని పేరిపి గ్రామంలో పాడి రైతులు పెంచుతున్న గడ్డి

చీపురుపల్లి: ఒకప్పుడు రైతులు వ్యవసాయం, పాడి పరిశ్రమను రెండు కళ్లుగా చూసుకునే వారు. అంతేకాకుండా పాడి పశువులు ఉన్న ప్రాంతంలో ఆర్థికాభివృద్ధి ఉంటుందనే నమ్మకం ఉండేది. తరువాత కాలంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి గతంలో ఉన్న ప్రభుత్వాలు ఎలాంటి ప్రోత్సాహకం అందించకపోవడం, పాడి పరిశ్రమ అభివృద్ధి చేసినా మార్కెటింగ్ సదుపాయాలు లేకపోవడంతో పూర్తిగా పాడిసంపద దూరమైంది. దీని కారణంగా పల్లెల్లో సైతం పాల ప్యాకెట్లు కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. పూర్వపు రోజులు తిరిగి రావాలని, రైతులు పాడి పంటలతో చక్కగా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాల డెయిరీలకు ఊతం కల్పించడంతో బాటు అమూల్ వంటి దిగ్గజ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని పాల సేకరణకు రంగం సిద్ధం చేశారు. అందులో భాగంగా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఆనుకుని బల్క్‌మిల్క్ కూలింగ్ కేంద్రాలను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అయితే పాడి సంపద బలోపేతం కోసం పాడి రైతులకు ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలను అందజేస్తోంది. మూగజీవాలకు మేత నుంచి వాటికి వ్యాధులు రాకుండా ఇచ్చే వ్యాక్సిన్‌లను ఉచితంగా వేసే పరిస్థితిని ప్రభుత్వం అమలు చేస్తోంది.

రాయితీపై గడ్డి విత్తనాలు

పాడి పశువులకు సమృద్ధిగా మేత అందించినప్పుడే పోషక విలువలు అధికమై పాల ఉత్పత్తి పెరుగుతుందనే ఆలోచనతో ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా గడ్డి విత్తనాలు సరఫరా చేస్తోంది. అయితే గడ్డి విత్తనాలు బయట మార్కెట్‌లో రైతులు కొనుగోలు చేసుకోవాలంటే ఆర్థిక భారం పడుతుందనే ఉద్దేశంతో 75 శాతం రాయితీపై ప్రభుత్వమే పంపిణీ చేస్తోంది. 5 కేజీల మినీ కిట్ పూర్తి ధర రూ.460 కాగా ప్రభుత్వం 75 శాతం రాయితీపై రూ.115కే అందజేస్తోంది. అందులో భాగంగానే అధికారులు జిల్లా వ్యాప్తంగా 60.02 టన్నుల గడ్డి విత్తనాలు పంపిణీకి లక్ష్యంగా పెట్టుకోగా ఇంతవరకు 20 టన్నుల విత్తనాలు పంపిణీ చేశారు. ఇంకా పంపిణీ చేసేందుకు 30 టన్నులు విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి. మరో 10 టన్నుల విత్తనాలు రావాల్సి ఉంది.

40 శాతం రాయితీపై చాప్ కట్టర్లు

పాడి పశువుల కోసం రైతులు గడ్డిని పెంచి దాన్ని కోసేందుకు కూలీలు ఖర్చు లేకుండా రైతులే సొంతంగా గడ్డి కోసుకునేందుకు యంత్రాలను సైతం ప్రభుత్వం 40 శాతం రాయితీపై రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేస్తోంది. గడ్డిని కోసేందుకు 2హెచ్‌పీ సామర్థ్యం కలిగిన చాప్‌కట్టర్ పూర్తి ధర రూ.33,970 కాగా ప్రభుత్వం 40 శాతం రాయితీపై కేవలం రూ.13,588కే సరఫరా చేస్తోంది. జిల్లావ్యాప్తంగా 45 చాప్ కట్టర్లు పంపిణీకి లక్ష్యం కాగా అందులో ఇప్పటి వరకు 36 చాప్ కట్టర్లు రైతులకు పంపిణీ చేసారు. ఇంకా చాప్ కట్టర్లు కావాల్సిన వారు రైతుభరోసా కేంద్రాల్లో వారి పేర్లు నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ప్రభుత్వం ఎంతో మేలు చేసింది



నా పేరు ఇప్పిలి శివ, మాది చీపురుపల్లి మండలంలోని పేరిపి గ్రామం. నాకు 10 ఆవులు ఉన్నాయి. వాటిని పోషించుకునేందుకు గడ్డి చాలా అవసరం. ప్రభుత్వం 75 శాతం రాయితీపై గడ్డి విత్తనాలు సరఫరా చేసింది. నేను పది కేజీల విత్తనాలు రాయితీపై కొనుకున్నాను. రాయితీపై ఇచ్చే ఆ విత్తనాలు మండల కేంద్రానికి కూడా వెళ్లకుండానే ఊరిలోనే లభించాయి. ఆ గడ్డితో మా ఆవులకు చక్కగా పోషణ లభిస్తోంది.

– ఇప్పిలి శివ, పేరిపి, చీపురుపల్లి మండలం

పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి



పాడి సంపద అభివృద్ధి కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. 75 శాతం రాయితీపై గడ్డి విత్తనాలు, 40 శాతం రాయితీపై చాప్ కట్టర్లు ప్రభుత్వం సరఫరా చేస్తోంది. అంతేకాకుండా 4 నెలల నుంచి 8 నెలల వయస్సు ఉన్న ఆవు లేదా గేదె పెయ్యి దూడలకు బ్రూసెలోసిస్(ఈసుడు) రోగం రాకుండా వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా ప్రభుత్వమే వేస్తోంది.

– విశ్వేశ్వరరావు, జాయింట్ డైరెక్టర్, పశుసంవర్ధకశాఖ, విజయనగరం